

## 16, 17 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సమావేశాలు
### రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్

**ప్రజాశక్తి - ఏలూరు**

ఈ నెల 16, 17 తేదీల్లో ఏలూరులో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సమావేశాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ తెలిపారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులు పడుతున్న కష్టాలు, భవిష్యత్తులో ఎటువంటి కష్టాలు పడబోతున్నారో వాటిని ఎలా ఎదుర్కోవాలో ఈ సమావేశ సారాంశమని చెప్పారు. ఈ సమావేశాలను విద్యార్థులు, శ్రేయోభిలాషులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ వివిధ జిల్లాల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతుందన్నారు. 16, 17 తేదీల్లో నిర్వహించే సమావేశాల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# చేప ధర ఢమాల్..!

### పెట్టుబడులు కూడా దక్కని వైనం
### పెరిగిన మేత ధరలు
### నష్టాలబాటలో చేపల సాగు రైతులు



చేపల పట్టుబడి చేస్తున్న రైతులు

**ప్రజాశక్తి - కాళ్ల**

రొయ్యల సాగే కాదు.. లాభాలు సంపాదించి పెడుతుందని భావించిన చేపల సాగు కూడా రైతులకు భారంగా మారింది. పెరిగిన పెట్టుబడులకు తగ్గట్టు ఆదాయం రాకపోవడంతో చేపల రైతులు నష్టాల బారిన పడుతున్నారు. చేపల ధర తగ్గిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఒకప్పుడు రైతులకు ఆర్థిక భరోసా ఇచ్చిన ఆక్వాసాగు ప్రస్తుతం నష్టాల దిశగా పయనిస్తోంది. చేపలు, రొయ్యల సాగు లాభాల దిశగా సాగినప్పుడు ప్రభుత్వానికి ఎన్నో కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్య రూపంలో ఆదాయం సమకూరింది. ప్రస్తుతం నష్టాలు ఎదురయ్యే సమయంలో టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలబడేలా పని చేయడం లేదని రైతులు అంటున్నారు.

ఒకవైపు చేపల ధరలు తగ్గడంతో పాటు మరోవైపు ఫీడ్ ధరలు విపరీతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చులు రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆక్వా రైతులు చేపల పట్టుబడులు చేస్తున్నారు. ఇదే అదునుగా తీసుకుని చేపల కొనుగోలుదారులు రేట్లు తగ్గించేస్తున్నారని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

**నష్టాలతో ఆక్వా రైతులు సతమతం..**

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల వరకూ చేపల సాగు జరుగుతోంది. ఈ రంగంపై ఆధారపడి లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం దిగుమతులు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లోని చేపల చెరువుల్లో కేజీన్నరకు పైగా బరువు పెరిగిన చేపలు పట్టుబడులకు సిద్ధంగా ఉన్నాయి. వీటికి రోజువారీ మేత కోసం ఎకరానికి రూ.వేలల్లో ఖర్చు పెడుతున్నారు. మేతల ధరలు గణనీయంగా పెరగడం, చేప ధర తగ్గడంతో ప్రస్తుతం పట్టుబడులు నిలిపివేసిన చెరువుల్లో చేపలను బతికించుకోలేక, అదనపు పెట్టుబడులు పెట్టలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పట్టుబడి చేసిన చేపలు

పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన ఆకివీడు, భీమవరం, కైకలూరు, గణపవరం పరిసర ప్రాంతాలు నుంచి దేశంలో అనేక ప్రాంతాలకు సుమారు 200 లారీల సరుకు రోజూ ఎగుమతి అవుతుంది. అయితే ఫీడ్ ధరలు ఆకాశాన్నంటడంతో జిల్లాలో ఆక్వా కల్చర్ సాగు అయోమయంలో పడిపోయింది. దీంతో సిరులు పండించిన తెల్ల చేప ఇప్పుడు నష్టాల ఊబిలోకి నెడుతోంది.

**తగ్గిన చేప ధర..**

చేపల మేత అయిన డిఒబి తవుడు మార్కెట్‌లో పది కిలోలు రూ.220 పలుకుతోంది. కొన్ని నెలల వ్యవధిలోనే అమాంతం దీని ధర పెరిగిపోయింది. గతంలో రూ.125 ఉన్న కిలో చేప ధర ప్రస్తుతం రూ.114-115లకు పడిపోయింది. చేప ధర తగ్గడం, మేత ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో జిల్లా రైతులు బెంబేలెత్తిపోతున్నారు. చేప కిలో పెరగాలంటే ప్రస్తుతం రూ.20 అదనంగా ఖర్చు అవుతోంది. మార్కెట్‌లో చేప ధర మాత్రం పెరగడం లేదని, ఖర్చుకు తగ్గట్టు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు.

రొయ్యల సాగు చేసినా వైరస్‌లు, ఇహెచ్‌పి, సెల్‌లూజ్‌లు, విబ్రియో పేరుతో నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆక్వారైతు రొయ్యల సాగు వదిలేసి చేపలు పెంచుతుంటే, నీటిపారుదలపరంగా పలు రకాల వ్యాధులు ఆశించడం, మరోవైపు ఫీడ్ ధరలు కూడా విపరీతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చులు రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. ఇందులో ఒక్క ఈశాన్య రాష్ట్రాలకే రోజుకు 100 లారీలకు పైగా వెళ్లాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో, కృష్ణా డెల్టా ప్రాంతంలో అత్యధికంగా చేపల సాగు చేస్తున్నారు. గతంలో రైతులకు ఆర్థిక భరోసా ఇచ్చిన ఆక్వా సాగు నేడు నష్టాల దిశగా పయనిస్తోంది. చేపలు, రొయ్యల సాగు లాభాల దిశగా సాగినప్పుడు ప్రభుత్వానికి ఎన్నో కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్య రూపంలో ఆదాయం సమకూరేది. నేడు నష్టాలు ఎదురయ్యే సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలబడాలని రైతులు కోరుతున్నారు.

### మేత ధరలు తగ్గించాలి..


**కంతేటి శ్రీనివాసరాజు,ఆక్వారైతు, ప్రాత్తిళ్లమెరక**



చేపల మేత ధరలు ఉన్నట్టుండి రూ.5 వేలు పెరిగింది. కేజీ చేప ధర మొన్నటి వరకూ రూ.125 ఉండేది. ప్రస్తుతం రూ.115లకు కొనుగోలు చేస్తున్నారు. కేంద్రబడ్జెట్‌లో రొయ్యల మేత ధరలు తగ్గిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వాటిని అమలు చేయాలి. విద్యుత్ సబ్సిడీ 1.50 పైసలు అందిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించింది. ఆక్వాజోన్, నాన్‌జోన్‌లో సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి. విద్యుత్ పరికరాలు, విద్యుత్ ట్రాన్స్ఫర్లు సబ్సిడీపై అందించాలి.

## కూటమి హయాంలో ఆర్‌టిసి ప్రగతిబాట
### రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి

**ప్రజాశక్తి - దెందులూరు**



మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్‌ఎలు

ఐదేళ్ల వైసిపి పాలనలో ఆర్‌టిసి మొత్తం నష్టాల్లో కూరుకు పోయిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి ప్రగతిబాట పట్టిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి చెప్పారు. సూర్యుడు వెళ్లిన ప్రతి చోటకూ ఎపిఎస్ ఆర్‌టిసి సేవలు వెళ్తాయన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని దెందులూరు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డితో ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఏ సంస్థలైనా లాభాల కోసమే కాదు, ప్రజలు తమపై పెట్టుకున్న విశ్వాసాన్ని నిజం చేయడానికి కూడా కృషి చేయాలన్నారు. నేడు ఏలూరులో 30కు పైగా కొత్త ఆర్‌టిసి బస్సులను ప్రవేశ పెడుతున్నామన్నారు. అతి త్వరలోనే మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తామన్నారు. క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని రవాణా శాఖ సంబంధిత పలు అంశాలపై ఎంఎల్‌ఎ చర్చించారు. ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం జరిగిన అల్పాహార విందులో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, సొంగా రోషన్ కుమార్ పాల్గొన్నారు.

## శనివారపుపేట కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేత

**ప్రజాశక్తి - ఏలూరు**

ఏలూరు శనివారపు పేటలో బ్రిడ్జి పైనుంచి తమ్మిలేరు నీటి ప్రవాహం పెరగడంతో ముందు జాగ్రత్త చర్యగా శనివారపుపేట కాజ్‌వే పైనుంచి తాత్కాలికంగా రాకపోకలు నిలిపివేసినట్లు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ తెలిపారు. శనివారపుపేట కాజ్‌వే వద్ద గురువారం తమ్మిలేరు వరద ఉధృతిని ఆర్‌డిఒ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏలూరు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మాలతి ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బందితో శనివారంపేట బ్రిడ్జిపై తమ్మిలేరు నీటి ప్రవాహానికి ఏర్పడ్డ అడ్డంకులను, చెత్తను దగ్గరుండి తొలగిస్తున్నట్లు చెప్పారు. వారి వెంట డిఎస్‌పి డి.శ్రావణ్ కుమార్, నగరపాలక సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పెరిగిన గోదావరి నీటిమట్టం
### పోలవరం ప్రాజెక్టు స్పిల్వే నుంచి 7,43,222 క్యూసెక్కుల నీరు విడుదల

**ప్రజాశక్తి - పోలవరం**



గుంజవరం వద్ద పొంగుతున్న కొండవాగులు

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం గురువారానికి పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే నుంచి 7,43,222 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. స్పిల్వే ఎగువున 31.430 మీటర్లు, స్పిల్వే దిగువున 22,790 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

**పొంగుతున్న కొండవాగులు..**

మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాగులు, కొవ్వాడ కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎల్లండిపేట కొవ్వాడ రిజర్వాయర్ కొండవాగుల వరద నీరు నిండిపోవడంతో బుధవారం రాత్రి 480 క్యూసెక్కులు, గురువారం ఉదయం రిజర్వాయర్ నీటిమట్టం 90.25 మీటర్లకు చేరుకోవడంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సిబ్బంది 1000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలవరం నుండి కన్నాపురం వెళ్లే రోడ్డు మార్గంలో దొండపూడి సాగిపాడు కల్వర్టుపై నాలుగు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కడెమ్మ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుండి గోదావరిలోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

**లోతట్టు ప్రాంతాలు జలమయం**

కురిసిన వర్షానికి పోలవరం పట్టిసీమ, గూటాల, కొత్తపట్టిసీమ, ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి పంచాయతీల్లో పలు గ్రామాలు జలమయమయ్యాయి.

**చింతలపూడి** : మండలంలోని నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి గురువారం ఇన్ ఫ్లో 6,393 క్యూసెక్కులు గాను, ఔట్ ఫ్లో 8893 క్యూసెక్కులు ఉన్నట్లు ఎఇఇ.పరమానందం తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరు బేసిన్ 349.36 అడుగులుగా, గొనెలవాగు బేసిన్ వద్ద 349.13 అడుగులు ఉందని తెలిపారు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టిఎంసిలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 2.003 టిఎంసిలుగా ఉందని తెలిపారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన సందర్భంగా తమ్మిలేరు ప్రవాహ ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

**ముదినేపల్లి భారీ వర్షం**

**ముదినేపల్లి:** మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి ప్రధాని ఆర్‌అండ్‌బి రోడ్లు జలమయమయ్యాయి. అలాగే గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. వర్షంతో పలు పల్లపు ప్రాంతాల్లో ఉన్న కాలనీల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటల వరకూ వర్షం పడుతూనే ఉంది. దీంతో కార్మికులకు పనులు లేకపోవడంతో ఇళ్లకే పరిమితమయ్యారు.

## వాహనాలకు టోల్‌ఛార్జీ ప్రతిపాదన విరమించుకోవాలి
### సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహనాలకు టోల్ ఛార్జీ వసూలు చేయాలన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పిపిపి పేరుతో రోడ్లపై టోల్ టాక్స్ వసూలుకు సన్నాహాలు చేయాలని కలెక్టర్ల సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయని తెలిపారు. తక్షణం వెయ్యి కిలోమీటర్ల పరిధిలో టోల్ వసూలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. అదే జరిగితే భవిష్యత్తులో మొత్తం 12,650 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులపై టోల్ వసూలు చేసే ప్రమాదం ఉందని తెలిపారు. రోడ్లు అభివృద్ధి చేయడం, వాటిని సక్రమంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతని ఆయన గుర్తు చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో లైఫ్ టాక్స్, డీజిల్, పెట్రోల్ పై రోడ్డు సెస్సు తదితర రూపాల్లో ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుతోందని, ఆ సొమ్ము ఆయా వాహన యజమానులు, వాటిలో ప్రయాణించేవారు ఇప్పటికే భరిస్తున్నారని తెలిపారు. పిపిపిల పేరిట రాష్ట్ర రహదారుల్లో ప్రతిపాదిక టోల్ టాక్స్‌లు మోయలేని భారాలుగా మారి రాష్ట్ర రవాణారంగాన్ని నష్టాలపాలు చేస్తున్నాయని విమర్శించారు. జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం 52 కిలోమీటర్లు, ఏలూరు మేడిశెట్టివారి పాలెం వయా చింతలపూడి 68 కిలోమీటర్లు, నరసాపురం అశ్వరావుపేట రోడ్డు 125 కిలోమీటర్లు ఈ రోడ్లపై టోల్ గేట్లు పెట్టబోతున్నట్టు వార్తలు వస్తున్నాయని తెలిపారు. నూజివీడు విసన్నపేట రోడ్డు కూడా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎఎస్ఆర్.నగర్ వాసుల గోడు వినాలి
### కలెక్టరేట్ వద్ద వ్యకాస ఆధ్వర్యాన ధర్నా

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఎఎస్ఆర్.నగర్ గ్రామ వాసుల గోడు వినాలని, గ్రామంలో కనీసం సౌకర్యాలు తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ టి.నర్సాపురం మండలం పుట్రేపు, ఎఎస్ఆర్ నగర్ గ్రామంలో సర్వే నంబర్ 86లో సుమారు 89.68 ఎకరాల గుట్ట పోరంబోకు భూమిలో 2006 నుంచి ఇళ్లు నిర్మించుకొని గిరిజనులు, దళితులు ఇతర కులాల్లో పేదలు నివాసం ఉంటున్నారని తెలిపారు. 15 ఏళ్లుగా ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా పేదలకు మాత్రం న్యాయం జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారుల కార్యాలయాలు చుట్టూ కాళ్లు అరిగేలా తిరగడమే తప్ప గిరిజనులు, దళితులకు నేటికీ న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2006లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండాలు వేసి భూమి స్వాధీనం చేసుకొని ఇళ్లు లేని పేదలు ఇళ్లు నిర్మించుకున్నా వారికి నేటికీ పట్టాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. నేటికీ అక్కడ నివాసముంటున్న సుమారు 70 కుటుంబాలు ఈ గుట్టపైనే ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పోరంబోకు భూమిలో సాగు చేసి జీడిమామిడి, పత్తి, బొబ్బర్లు, అపరాలు వంటి పంటలు పండించుకొని జీవనం సాగిస్తున్న గిరిజన, దళితల భూములకు పట్టాలివ్వాలని కోరారు. గిరిజన మహిళలపై స్థానిక భూస్వాములైన దేవరపల్లి సీతారామయ్య, పర్వాతనేని బ్రమ్మాజీ, వాళ్ల బినామీలు దాడి చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వ్యకాస నేతలు, ఎఎస్ఆర్.నగర్ వాసులు

వ్యక్తం చేశారు. 2006 నుంచి పోరాడుతున్న పేదలకు జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు, హైకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చినా రెవెన్యూ శాఖ, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్కడ నివాసం ఉన్న పేదలకు నష్టం జరిగిందన్నారు. ఎఎస్ఆర్.నగర్ మెట్టపై విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పించాలని హైకోర్టును ఆశ్రయించగా విద్యుత్, తాగునీరు సరఫరా చేయాలని పంచాయతీ, మండల అభివృద్ధి అధికారులకు ఆదేశాలు ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచిన నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోగా భూములు ఆక్రమించుకునే భూస్వాములకే ఈ భూములు అప్పజెప్పాలని రెవెన్యూ శాఖ అధికారులు చూస్తున్నారన్నారు. పేదలపై అక్రమ కేసులు పెట్టి మహిళలని చూడకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. ఇక్కడ నివాసం ఉంటున్న వారిలో ఎక్కువ మంది ఒంటరి మహిళలు, దళితులు గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. సర్వేనంబర్ 85/2లో అసైన్డ్, సీలింగ్ భూస్వాములు సుమారు 6.61 ఎకరాలు ఆక్రమించుకొని అక్రమంగా వ్యవసాయం చేస్తుంటే రెవెన్యూ శాఖ అధికారులు ఏ మాత్రమూ పట్టించుకోలేదని విమర్శించారు. వారికి మద్దతుగా స్థానిక విఆర్ఒ గోపి, మాజీ డిప్యూటీ తహశీల్దార్ రాధాకృష్ణ భూస్వాములకు సహకరిస్తున్నారని ఆరోపించారు. వీరు భూస్వాములు ఇచ్చే లంచాలు మింగి దళితులు, గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక విఆర్ఒ గోపి, మాజీ డిప్యూటీ తహశీల్దార్ రాధాకృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నివాసం ఉంటున్న దళిత గిరిజనులకు వైద్యం సరిగా అందడం లేదన్నారు. రెండు రోజుల క్రితం టి.నర్సాపురం ప్రభుత్వాధికారులు, వైద్య సిబ్బంది డాక్టర్స్, నర్సులు సకాలంలో స్పందించకపోవడంతో బాలింతరాలు చనిపోయిందన్నారు. బాలింతరాలు మంగ చనిపోవడానికి కారుకులైె వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు అనుమోలు మురళి, భారగడ కుమారి, ముత్తమ్మ మడకం కుమారి పాల్గొన్నారు.

## ఆదర్శ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య
### మృతికి పలువురి సంతాపం

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఆదర్శ ముఖ్యమంత్రి బుద్ధ దేవ్ భట్టాచార్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి రవి కొనియాడారు. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్ బ్యూరో మాజీ సభ్యులు బుద్ధదేవ్ భట్టాచార్య ఆకస్మిక మృతికి సంతాపం తెలియజేస్తూ గురువారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షత వహించారు. సభలో ముందుగా బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు పి.ఆదిశేషు, విజిఎంఆర్.కృష్ణారావు పూలమల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో 35 ఏళ్ల పాటు ఏకధాటిగా సిపిఎం ప్రభుత్వం నడిపిందని గుర్తు చేశారు. ఆ ప్రభుత్వంలో 2000 సంవత్సరం నుంచి 2011 వరకు 11 ఏళ్ల పాటు బుద్ధదేవ్ భట్టాచార్య ఆదర్శ ముఖ్యమంత్రిగా పరిపాలన కొన సాగించారన్నారు. ఆ రాష్ట్రంలో భూమిలేని పేదలకు భూములు పంపిణీ చేసే భూసంస్కరణలు, కౌలు రైతులకు కౌలుదారి చట్టం వంటివి పకడ్బందీగా అమలు చేసిన ఘనత బుద్ధదేవ్ భట్టాచార్యకు దక్కుతుందని కొనియాడారు. కార్మికులు, కర్షకులు, పేదల అభ్యున్నతికి బుద్ధదేవ్ భట్టాచార్య పాటుపడ్డారన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన దిగిపోయే నాటికి ఒక ఆటో రిక్షాలో తనకున్న కొద్దిపాటి సామాన్లతో ఇంటికి చేరుకున్నారని తెలిపారు. ఒక సాధారణ నివాసంలోనే నివసించారని గుర్తు చేశారు. అంత నిరాడంబర ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య అని కొనియాడారు. బుద్ధదేవ్ భట్టాచార్య ఆశయలను సిపిఎం ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పివి.రామకృష్ణ, నాయకులు పి.ఆదిశేషు, బి.జగన్నాథరావు, కట్టా సత్యనారాయణ, విజిఎంఆర్.కృష్ణారావు, జి.శారద, మంచళ్ల ఇసాక్, జి.కోటేశ్వరరావు, మీసాల సత్యం, సింహాచలం, వై.సీతారాం పాల్గొన్నారు.



ఏలూరు అర్బన్ : నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు



నిడమర్రులో...

**ఆగిరిపల్లి :** సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు, ఎస్.కోటేశ్వరరావు, ఇ.రవీంద్ర, జి.పాపారావు పాల్గొన్నారు.

**నిడమర్రు :** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ భట్టాచార్య మృతి బాధాకరమని సిపిఎం, సిఐటియు నేతలు అన్నారు. మండలంలోని భువనపల్లి గ్రామంలో మూడు రోడ్ల జంక్షన్ రావిచెట్టు సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య నిడరంబరమైన సాధారణ జీవితం ఆదర్శమన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలించారన్నారు. ముఖ్యమంత్రిగా చేసినప్పటికీ సొంత ఆస్తి లేకుండా సామాన్యమైన వ్యక్తిగా ఆయన జీవితం కొనసాగించారన్నారు. నేటి రాజకీయ పాలకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, కానూరు రాజు, కమిలి నాని, లింగబరి లక్ష్మణరావు, పుల్లూరు చంటి, గారపాటి పెద్దకాపు, అరుగులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్ :** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య గురువారం మృతి చెందారు. ఆయన 11 ఏళ్ల పాటు 2000 నుంచి 2011 వరకు బెంగాల్ సిఎంగా ఉన్నారు. కోల్‌కతాలోని పామ్ అవెన్యూలో గురువారం ఉదయం 8.30 గంటలకు మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శి హనుమాన్లు, సిపిఎం నాయకులు శోభనాద్రి, శ్రీను సంతాపం తెలిపారు.



నూజివీడులో...

## హాస్టల్ విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలి
### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్

**ప్రజాశక్తి - ఏలూరు**




నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

స్థానిక అమీనాపేటలో ఉన్న బాలికల హాస్టల్ విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హాస్టల్ విద్యార్థినులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ హైస్కూల్ స్థాయి నుంచి డిగ్రీ వరకు దాదాపు వెయ్యి మంది విద్యార్థులు ఉంటారన్నారు. హాస్టల్‌కి వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా ఉండడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హాస్టల్ దగ్గర గోడ దగ్గర నుంచి సబ్‌స్టేషన్ వరకు అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. వర్షం కురిస్తే విద్యార్థినులు రోడ్డు దాటేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హాస్టల్లో డ్రెయినేజీలు పొంగిపోయాయన్నారు. గతంలో జిల్లా అధికారులకు పలుమార్లు చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. డ్రెయినేజీ నీరు అలా ఉండిపోవడంతో దోమలు దోమల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. విద్యార్థినులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. విద్యార్థుల ప్రాణాల మీదకు వచ్చేవరకూ అధికారులు స్పందించరా అని ప్రశ్నించారు. వెంటనే హాస్టల్ డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలి
### జెసి ధాత్రిరెడ్డికి ఆలిండియా లాయర్స్ యూనియన్ వినతి

**ఏలూరు** :కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐలు జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ, జిల్లా కమిటీ సభ్యులు గెద్దా విజయభాస్కర్, పి.వెంకట్, ఏలూరు నగర కమిటీ సభ్యులు ఆర్.కిషోర్, జిపిడి.కుమార్‌లు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జులై ఒకటో తేదీ 2024 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించేటప్పుడు ప్రతిపక్షాలకు చెందిన 146 మంది పార్లమెంట్ మెంబర్లను సస్పెండ్ చేసి కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాలను ఆమోదించిందన్నారు. ప్రజలకు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, వాక్ స్వాతంత్యం, సమావేశమయ్యే హక్కు, సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు, నిరసన ప్రదర్శన చేసుకునే హక్కు కొత్త చట్టాలు హరిస్తాయన్నారు. ప్రజలు ఉద్యమాలకు సిద్ధమవుతారని, దానికి న్యాయవాదులు మార్గదర్శకులుగా ఉంటారన్నారు. బెంగాల్ ప్రభుత్వం ఈ మూడు క్రిమినల్ చట్టాల అమలు చేయరాదని అసెంబ్లీ తీర్మానం చేయించి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.

## వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

### జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సుధాకర్

**ప్రజాశక్తి - ఏలూరు**

యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ వారి ఆధ్వర్యంలో సెట్‌వెల్ కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి జి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిర్దిష్ట లక్ష్యాలను నిర్ణయించుకుని చదువులో ముందుకు సాగాలని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కెరీర్ కౌన్సిలర్ జిల్లా కో-ఆర్డినేటర్ నేషనల్ కెరీర్ సర్వీస్ జి.ప్రవీణ్‌కృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జ్ఞానం, సత్ప్రవర్తన కలిగి ఉండాలని చెప్పారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి, ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్‌వెల్ సి.మధుభూషణరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి.సుధాకర్, జిల్లా కో-ఆర్డినేటర్ నేషనల్ కెరీర్ సర్వీస్ జి.ప్రవీణ్‌కృష్ణ, ఒకేషనల్ గైడెన్స్ కోర్స్ సెట్ వెల్ ఇఇ. వి.వరలక్ష్మి, మేనేజర్ పివిఎస్.సత్యనారాయణ, పర్యవేక్షకులు కెజె.కెనడి, అకౌంటెంట్ పసుపులేటి ప్రసాద్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆదివాసీ కొండరెడ్లు

## సమస్యలు పరిష్కరించాలని నిరసన

**ప్రజాశక్తి - బుట్టాయగూడెం**

పునరావాస కాలనీలో సమస్యలు పరిష్కరించాలని గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణ స్ఫూర్తితో దొరమామిడి కొయిదా నిర్వాసిత కాలనీలో ఆదివాసీ కొండరెడ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సొంత ఊరిని, నివాసాలను, పొలాలను సర్వస్వాన్ని వదులుకుని నిర్వాసితులుగా మిగిలిన తమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ముందు లబ్ధిదారులుగా ఉండి నిర్వాసిత సమస్యలు శాశ్వత పరిష్కారం నోచుకోలేక నిరాశ్రయులై ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు, సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. గత వైసిపి ప్రభుత్వం నిర్వాసితులను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## గండి పూడ్చాలని ఎంఎల్‌ఎకు వినతి

**ప్రజాశక్తి - చింతలపూడి**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గణిజర్ల పాల వాగు వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డుకు గండి పడింది. దీంతో రోజుకు 20 ట్రక్టర్ల పామాయిల్ గెలల రవాణా ఆగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాఘవాపురం విద్య సంస్థలకు వెళ్లి చదువుకునే బాల బాలికల స్కూల్ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఆటోలు కూడా తిరగకపోవడంతో వృద్ధులు వైద్యం చేయించుకునేందుకు వెళ్లలేకపోతున్నారన్నారు. ఆర్‌అండ్‌బి అధికారులతో గండి పూడ్చివేత చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ గురువారం వినతిపత్రం అందించారు.

## 25 మంది ఉద్యోగాలకు ఎంపిక

**ప్రజాశక్తి- ఏలూరు సిటీ**

జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీస్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్, ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో సెట్ వెల్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుభూషణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు 115 మంది నిరుద్యోగ యువత హాజరవ్వగా 25 మంది ఎంపికయ్యారని చెప్పారు.

## పాఠశాలకు ఆరు కంప్యూటర్లు వితరణ

**ప్రజాశక్తి - కలిదిండి**

మండలంలోని ఆవకూరు ఎంపిపి పాఠశాలకు నార్త్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ హైదరాబాద్ సిఎస్ఆర్ ఫండ్ సహకారంతో ఆరు కంప్యూటర్లు, ఇన్వర్టర్, ప్రింటర్, ఆరు టేబుల్స్, ఆరు కుర్చీలు గురువారం అందించారు. ఆ సంస్థ నుంచి వరసాల శివప్రసాద్, నున్న సునీల్‌కుమార్, కె.ఆనంద్, వి.నరేంద్ర, ఎం.సురేష్ హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు మేకా రామారావు, సర్పంచి ఎన్.నరసయ్య, పాఠశాల సిబ్బంది, శివ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ప్రతినిధులను సన్మానించి, వారిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

## నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

**ప్రజాశక్తి - ఏలూరు**

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం కోటరామచంద్రాపురంలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల తొమ్మిదో తేదీన నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ జి.శ్రీనుకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

**జీలుగుమిల్లి** : ప్రపంచ ఆదివాసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు గిరిజనులందరూ ముందుకు రావాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనుల సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉంటూ కూడా గిరిజనులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరారు. గిరిజనుల చట్టాలను కాపాడాలని కోరారు. పోడు భూముల పట్టాలు ఇవ్వాలని, 1/70 యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని, జిఒ 3ను రద్దు చేయాలని, గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఆదివాసీలకు సరైన విద్య వైద్యం కల్పించాలని నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

## తలసేమియా రోగులకు రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

స్థానిక సరిసిలర్ రెడ్డి కళాశాలలో గురువారం సెంట్రల్ జిఎస్‌టి కమిషనరేట్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఏలూరు గ్రెనార్కుబ్ల్, ఏలూరు హెల్పింగ్ లయన్స్ క్లబ్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియా రోగుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కొడాలి వెంకట సుబ్బారావు, పిజి కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకరి రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందన్నారు. రక్తం అవసరమయ్యే రోగుల సంఖ్య కంటే రక్తదానం చేసే వారి సంఖ్య తక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.రామరాజు, జి.తులసి, సూపరింటెండెంట్ సెంట్రల్ జిఎస్‌టి ఏలూరు రేంజ్, ఏలూరు గ్రెనారు క్లబ్ అధ్యక్షులు కె.పద్మ, రెడ్ క్రాస్ డైరెక్టర్ ప్రసాదరావు వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని 119 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు.

## 'ప్రజారోగ్యానికి టిడిపి కూటమి పెద్దపీట'

**ప్రజాశక్తి - చింతలపూడి**

టిడిపి కూటమి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని చింతలపూడి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కొండ్రు దేవా అన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో వాడే రూ.40 వేల ఇంజక్షన్ ఇప్పుడు చింతలపూడి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభిస్తుందని చెప్పారు. ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు, వైద్య పరికరాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు.



## ఉమ్మడి జిల్లా జెడ్‌పిటిసి ఛాంబర్ ఉపాధ్యక్షురాలిగా జయలక్ష్మి

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

ఉంగుటూరు జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి ఉమ్మడి జిల్లా జెడ్‌పిటిసి ఛాంబర్ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఏలూరులో ఈ ఎన్నిక జరిగిందని జయలక్ష్మి తెలిపారు. కైకరం గ్రామానికి చెందిన జయలక్ష్మి గతంలో ఉంగుటూరు ఎంపిపిగా పనిచేశారు. ప్రస్తుతం వైసిపి తరపున ఉంగుటూరు జెడ్‌పిటిసి సభ్యులుగా ఉన్నారు. ఆమెకు ఉమ్మడి జిల్లా జెడ్‌పిటిసి ఉపాధ్యక్షురాలిగా పదవి ఇవ్వటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జెడ్‌పిటిసి సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉంగుటూరు మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని జయలక్ష్మి అన్నారు. ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ మరడా మంగారావు, పలువురు సీనియర్ నాయకులు అభినందనలు తెలిపారు.



జయలక్ష్మి

## 14న క్యాంపస్ డ్రైవ్

**ప్రజాశక్తి - ఏలూరు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇంటర్మీడియట్ బోర్డు హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సిఎల్ టెక్ బి కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడంలో భాగంగా ఈ నెల 14వ తేదీ సర్‌సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ తల్లి లేదా తండ్రితో హాజరు కావాలని అయన తెలిపారు. వివరాలకు 9666322032, 9652503799 సంప్రదించాలని తెలిపారు.

## పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

**ప్రజాశక్తి - ముసునూరు**

వర్షాకాలంలో గ్రామ ప్రజలకు మలేరియా, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వైద్య సలహాలు, పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని సిపిఎం నాయకులు జి.రాజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని కోరారు. మండల కేంద్రమైన ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల మందులు ఆశావర్కర్లు, సిబ్బందితో గ్రామ ప్రజలకు అందించాలన్నారు. అలాగే కొన్ని భయంకరమైన వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కోరారు.

## అంకితభావంతో పనిచేస్తేనే గౌరవం

**ప్రజాశక్తి -ముదినేపల్లి**

అంకితభావంతో పనిచేసే పంచాయతీ కార్యదర్శులకు అన్నిచోట్ల గౌరవం లభిస్తుందని వడలి సర్పంచి మరీదు దుర్గాశ్రీ అన్నారు. వడాలి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగోన్నతపై కృష్ణా జిల్లా గుడివాడ మండలం శేరి గొల్వేపల్లి గ్రామపంచాయతీ గ్రేడ్ -2 కార్యదర్శిగా బదిలీపై వెళ్లిన రమేష్‌కు గురువారం గ్రామ సచివాలయంలో వీడ్కోలు సభ నిర్వహించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడాలి, వైవాక సచివాలయ సిబ్బంది, మరీదు హనుమంతు, నున్న కనకరాజు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

## కళాశాలలో క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం

**ప్రజాశక్తి - కామవరపుకోట**

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ అహింసాయుతంగా నిర్వహించిన క్విట్ ఇండియా ఉద్యమ ప్రభావం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ధారావతు మల్లేష్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు, కెమిస్ట్రీ అధ్యాపకురాలు ఎం.ఉషారాణి, అధ్యాపకేతర సిబ్బంది చంద్రమోహన్, కుమార్ రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలి

### రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

మండలం పల్లెర్లమూడి గ్రామంలో అత్యాచారానికి గురైన నాలుగేళ్ల బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన పల్లెర్లమూడిలో బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ బాలికపై అఘాయిత్య ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తప్పు చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి, కేసు విచారణను వేగవంతం చేస్తున్న పోలీసు, జిల్లా యంత్రాంగాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. సంఘటనను పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేశారని, అఘాయిత్యానికి గురైన బాలిక కుటుంబానికి రూ.ఐదు లక్షల వరకు పరిహారం అందించాలన్నారు. నివేదికలు అందిన వెంటనే 50 శాతం పరిహారంగా రూ.2.50 లక్షలు అందించాలని, ఛార్జీషీట్ దాఖలు చేసిన తరవాత 25 శాతం, నిందితుడికి శిక్ష పడిన తర్వాత మిగిలిన 25 శాతం పరిహారం అందించాలని ఆయన కోరారు. కేసును త్వరితగతిన విచారణ పూర్తి చేసి, నిందితునికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని శంకర్ నాయక్ అధికారులను కోరారు. ఆయనతో పాటు కోటరామచంద్రాపురం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి జి.శ్రీనుకుమార్, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ భాస్కర్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సుబ్బారావు, సిడిపిఒ ఎస్‌వై.నూరాని, వ్యవసాయాధికారి చాముండేశ్వరి, గొల్లపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి నెజ్మా, రూరల్ సిఐ రామకృష్ణ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కూల్ బస్సుల రోడ్ ట్యాక్స్ తగ్గించాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న పాఠశాలల ఛైర్మన్లు

**ప్రజాశక్తి - ఏలూరు**

స్కూల్ బస్సుల రోడ్ ట్యాక్స్ తగ్గించాలని కోరుతూ గురువారం ఏలూరుకు వచ్చిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డికి అపుస్మా తరపున పలు పాఠశాలల ఛైర్మన్లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పాఠశాలల ఛైర్మన్లు ఎంబిఎస్.శర్మ, కె.విజయలక్ష్మి, కె.చంద్రశేఖరరావు, ఎన్‌ఆర్‌కెవి.ప్రసాద్, వినోద్, ఎస్.సతీష్, రాణా మాట్లాడుతూ సమస్యను మంత్రికి వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో స్కూల్ బస్సుల రోడ్ ట్యాక్స్ 300 శాతం పెంచారన్నారు. ఏ రాష్ట్రంలో ఒకేసారి ఇంత పెంపు లేదని చెప్పారు. స్కూల్ బస్సుల రోడ్ ట్యాక్స్ తగ్గించాలని కోరారు. మంత్రికి వినతిపత్రం అందించేందుకు సహకరించిన ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటికి, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు, చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డుకు మరమ్మతులు చేయరూ..!

**ప్రజాశక్తి - బుట్టాయగూడెం**

ఏజెన్సీ ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గురుగుమిల్లి నుంచి రెడ్డి బొడ్డేరు, చింత కొండ, గొట్టాలరేవు, పూసు గొంది, కొండరెడ్డి గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా పాడైపోయింది. గురుగుమిల్లి నుంచి గొట్టాలరేవు వెళ్లే దారిలో మార్గమధ్యంలో కొండకాలువ రోడ్డుకు అడ్డంగా ప్రవహిస్తుంది. ఈ రెండు రోజులకు కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రయాణాలకు ఇబ్బందిగా ఉంది. పైగ్రామాలకు పాఠశాలలకు వెళ్లడానికి ఉపాధ్యాయులకు మార్గం లేదు. పై గ్రామాల కొండరెడ్లు గిరిజనలు కిందికి దొరమామిడి ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం రావాలన్నా, నిత్యావసర వస్తువులకు రావాలన్నా మార్గం పూర్తిగా పాడైపోవడంతో కొండ రెడ్డి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని గ్రామాల కొండ రెడ్లు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రోడ్డు

## ఆదాయ వనరులు పెంపొందించుకోవాలి

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

గ్రామాల్లోని ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి దాన్ని సేంద్రీయ ఎరువుగా తయారు చేసి, రైతులకు విక్రయించి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండలంలోని పి.ఆంకంపాలెం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం డివిజన్ స్థాయి వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో తయారయ్యే వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్మాణంలో ఉన్న సంపద తయారీ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ ప్రారంభం నాటికి ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రీయ ఎరువులను తయారు చేసి వాటిని రైతులకు విక్రయించి ఆ సొమ్మును పంచాయతీల అభివృద్ధికి ఉపయోగించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం క్లాప్ మిత్రాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన అధ్యక్షులు ఎస్.సాయి. పి.రాము, సర్పంచి జగ్గారావు, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, డిఎల్‌డిఒ రాజు, డిఎల్‌పిఒ రాజాఉల్లా, ఎంపిడిఒ కెఎం.మంగతాయారు, డివిజన్ స్థాయి ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి

**ప్రజాశక్తి - మండవల్లి**

విద్యార్థులకు రక్షణ కల్పించే విధంగా వెంటనే ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-బి2ను గురువారం పలువురితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా మండల ప్రాథమిక పాఠశాల-బి1, బి2 ప్రహరీ గోడలను తొలగించారన్నారు. నష్టపరిహారం కింద ప్రాథమిక పాఠశాల బి1కి వచ్చిన రూ.4,95,787 మండల ప్రాథమిక పాఠశాల బి2కి నష్టపరిహారం కింద వచ్చిన 13,78,951 పాఠశాలల కమిటీ ఖాతాలో వేసినట్లే వేసి తిరిగి ప్రభుత్వం తీసేసుకోవడం బాధాకరమన్నారు. ఆ ప్రాంతంలో తిరిగి నూతనంగా ప్రహరీ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో రక్షణ కరువైందని స్పష్టం చేశారు. ప్రహరీ గోడలు లేకపోవడంతో పశువులు, కుక్కలు, పందులు పాఠశాలలో స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులను వెనక్కి రప్పించి వెంటనే ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టి విద్యార్థులను ప్రమాదాల నుంచి కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు, టిడిపి నాయకులు ముల్లపూడి సత్తిబాబు, ఉపాధ్యాయురాలు రాహేలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎస్ఎంసి ఎన్నికలు

**ప్రజాశక్తి - భీమడోలు**

భీమడోలు మండల పరిధిలో గురువారం చేపట్టిన పాఠశాల యాజమాన్య కమిటీల ఎంపిక ప్రశాంతంగా ముగిసింది. దీనిలో భాగంగా 35 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, రెండు ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు, పొలసానిపల్లిలోని అంబేద్కర్ గురుకులం (బాలికల) పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించారు. ఉదయం యాజమాన్య కమిటీలో సభ్యుల ఎన్నిక జరిగింది. మధ్యాహ్నం పాలక మండలి ఎన్నికలు జరగగా, ఆ తరువాత పాఠశాల యాజమాన్య కమిటీ తొలి సమావేశాన్ని నిర్వహించారు. మండల స్థాయి ఎన్నికల పరిశీలకులుగా భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవితో పాటు స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి సహాయకులుగా వ్యవహరించారు. ఇదే క్రమంలో మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కరకుమార్ ఎన్నికల సజావుగా జరగడానికి సహకరించారు. మండలంలోని పూళ్ల హైస్కూల్ నుంచి తొమ్మిది, పదో తరగతిలకు ఎంపిక కావాల్సిన తరగతి స్థాయి కమిటీ సభ్యుల ఎన్నిక కోరం లేని కారణంగా నిర్వహించలేదు.

**ముసునూరు** :మండలంలోని 16 గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండల ప్రాథమిక పాఠశాలలో, దిగువ తరగతి పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి విద్యా కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి, తహశీల్దార్ కె.రాజకుమార్, డిప్యూటీ తహశీల్దార్ వి.కుమారి, టిడిపి మండలాధ్యక్షులు దేవినేని ఢలరామ్ పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం** :మండలంలోని మైసన్నగూడెం ప్రీ హైస్కూల్‌లో ఎస్ఎంసి ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించారు. ఛైర్మన్‌గా పిల్లి శ్రీనివాస్, వైస్ ఛైర్మన్‌గా గండికోట జ్యోతి, లింగగిరి సత్యవాణి ఎన్నికయ్యారు.

**చాట్రాయి** :చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా చల్లారి ఆదిలక్ష్మి, వైస్ ఛైర్మన్‌గా కటారపు ఆనందరావు, 13 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.కృష్ణయ్య తెలిపారు. చాట్రాయి ఎంపిపి మెయిన్ పాఠశాల ఛైర్మన్‌గా చుండూరి రమేష్ ఎన్నికయ్యారని ప్రధానోపాధ్యాయులు జి.రాము తెలిపారు. తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాల ఛైర్మన్‌గా షేక్ హసీనా, వైస్‌ఛైర్మన్‌గా షేక్ ఆయేషాబేగం ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు తెలిపారు. జనార్ధనవరం ఎంపిపి మెయిన్ పాఠశాల ఛైర్మన్‌గా తోటకూర వరప్రసాద్ ఎన్నికయ్యారు.

**కొయ్యలగూడెం** : మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలలకు ఆయా ప్రధానోపాధ్యాయుల సమక్షంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. తహశీల్దార్ చెల్లన్నదొర, ఎంపిడిఒ అశోక్‌కుమార్, ఎంఇఒ సురేష్‌బాబు, ఎంఇఒ-2 వెంకటేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివిధ పాఠశాలలను సందర్శించి ఎన్నికల నిర్వహణను పరిశీలించారు.

**నూజివీడు టౌన్** : పాఠశాల అభివృద్ధి లక్ష్యంగా ఎస్ఎంసి పని చేస్తుందని నూజివీడు బాలికల హై స్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వీణరాణి తెలిపారు. పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించారు. జెడ్‌పి బాలికల హైస్కూల్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నాగులు, వైస్ ఛైర్ పర్సన్‌గా శాంతకుమారి, మరో 30 మంది సభ్యులను ఎన్నుకున్నారు. జెడ్‌పి బాలుర హై స్కూల్ ఛైర్‌పర్సన్‌గా ఆబోతుల లక్ష్మి, వైస్ ఛైర్ పర్సన్‌గా రౌతు నాగమణి ఎన్నికయ్యారు. తుక్కులూరు గ్రామంలోని ఉర్దూ స్కూల్ ఛైర్ పర్సన్‌గా నాగూర్ మున్నీసా, వైస్ ఛైర్ పర్సన్‌గా సూరపనేని లక్ష్మి ఎన్నికయ్యారు.

**జీలుగుమిల్లి** :మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాలల్లో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ల ఎన్నికను సజావుగా నిర్వహించినట్లు ఎంఇఒలు కె.శ్రీనివాస్, ఎస్.బుచ్చయ్య తెలిపారు.

**టి.నరసాపురం** : మండలంలో గురువారం ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ-1 టి.రామ్మూర్తి తెలిపారు. మొత్తం 60 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కమిటీ సభ్యుల ఎన్నికలు జరగాయని 28 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా 32 పాఠశాలల్లో ఓటింగ్ ద్వారా ఎన్నికలు జరిగాయన్నారు.

**బుట్టాయగూడెం** : మండలంలో 131 పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ తెల్లం బాబూరావు తెలిపారు. 112 ప్రాథమిక పాఠశాలల్లో, ఒక యుపి, ఒక ఎయిడెడ్ పాఠశాల, 17 ఆశ్రమ పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 131 పాఠశాలలకు స్కూలు యాజమాన్య కమిటీ మెంబర్లుగా 1506 మందిని విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు.



కొయ్యలగూడెంలో...

**ఆగిరిపల్లి** : మండల పరిధిలోని 50 పాఠశాలల్లో 49 పాఠశాలలకు నూతన కమిటీలు ఎన్నిక కాగా అడవినెక్కలం జెడ్‌పి హెచ్ స్కూల్‌లో కోరం లేకపోవడంతో ఎన్నికలు జరగలేదు.

**చింతలపూడి** : నాగిరెడ్డిగూడెం బాలికల పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్‌గా గుర్రం నాగరాజు ఎన్నికయ్యారు. వైస్ ఛైర్మన్‌గా డి.లలిత ఎన్నికయ్యారు.

**ముదినేపల్లి** : మండలంలోని 67 పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఎనిమిది జెడ్‌పి హై స్కూల్స్, 11 యుపి, 48 ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన పాఠశాల నిర్వహణ కమిటీలకు సంబంధించిన ఎన్నికలు గురువారం సజావుగా జరిగాయి.

### దస్తావేజు పోయినది

మా క్లయింటు తాడేపల్లిగూడెం మండలం, ఆరుగొలను శివారు కొత్తూరు గ్రామ కాపురస్తులు అయిన చింతాడ అప్పారావు (లేటు) గారి భార్య చింతాడ శారద మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు
కొత్తూరు గ్రామము మా క్లయింటు కడియద్ద గ్రామంలో 3. సెంట్లు (చ.గ. 145.2 గజములు) ఇంటి స్థలము కలదు. సదరు స్థలము ఆర్.ఎస్.నెం. 190-5. సదరు స్థలమును ది.16.07.2018వ తేదీన కడియద్ద గ్రామమునకు చెందిన పాకిన ఆకులక్ష్మి గారి కుమారుడు పాకిన సూర్యారావు గారి వద్ద నుండి స్థలము కొనుగోలు చేసియున్నారు. మరియు సదరు స్థలము రిజిస్ట్రేషను చేయించియున్నారు. డాక్యుమెంటు నెం.6560/2018. ది.**30.07.2024**వ తేదీన సాయంత్రం 4 గంటలకు మా క్లయింటు సదరు దస్తావేజును పట్టుకొని తాడేపల్లిగూడెం బ్యాంకునకు లోన్ నిమిత్తం వస్తూఉండగా మార్గం మధ్యలో ఆటోలో మా క్లయింటు ఒరిజినల్ దస్తావేజు పోయినది. ఆమె వెదకినా గాని కనిపించలేదు. ఎవరికైన దొరికిన యెడల మా క్లయింటుకి అందచేయగలరు, దొరికిన వారు ఎటువంటి లావాదేవీలు అపత్రలపై జరిపిన యెడల మా క్లయింటు బాధ్యులు కారని తెలియచేయుచున్నాను.

**సాలి కొండలరావు అడ్వకేట్**
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం,
తేది.08.08.2024. సెల్:9866602908.

### చెక్‌బుక్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, చిన్ని వారి వీధి, డోర్‌నెం. 19-10-4 చెందిన మైగాపుల పెద్దిరాజు, S/o.శ్రీరాములు అను నా యొక్క ఒరిజినల్ చెక్‌బుక్ పోయినది. చెక్‌బుక్ నెం.3826 - 38365 IDBI బ్యాంకు అకౌంటు నెంబర్: 036610400008 1148. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

**మైగాపుల పెద్దిరాజు S/o.శ్రీరాములు,**
**భీమవరం, ప.గో.జిల్లా.**
**సెల్: 7981929767**

### పాస్‌పోర్టు పోయినది

యలమంచిలి మండలం ఆర్యపేట పంచాయతీ కి చెందిన, గెద్దం చక్రవర్తి s/o.గెద్దం రాయుడు, డోర్ నెంబర్ 2-51-1, ఆర్యపేట యలమంచిలి మండలం, w.g.dt తెలుపుకొను విన్నపం ఏమనగా నేను ది 5-7-2024వ తేదీన నా ఒరిజినల్ పాస్ పోర్ట్ జెరాక్స్ తీయు నిమిత్తం ఆర్యపేటలోని మా ఇంటి నుంచి మేడపాడు సెంటర్‌కు మోటార్ సైకిల్ పై వెళుతుండగా దారిలో పడిపోయింది. ఎంత వెతికినా దొరకలేదు. దీనిని నేను 07-02-1981న వైజాగ్ పాస్ పోర్ట్ కార్యాలయం నుండి F6611117గా పొందియున్నాను. ఎవరికైన దొరికితే నాకు అందజేయగలరు.

**సెల్ 9674484905**

**మహారాజశ్రీ ఏలూరు ఫస్టు ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**ఇ.పి.నెం.47/2019, ఒ.యస్.నెం.973/2007**

మధ్య
వేల్పుల వెంకటేశ్వరరావు ...డిక్రీ హోల్డరు
మరియు
కొండపల్లి దుర్గ, కొండపల్లి సుబ్బారావు,
కొండపల్లి చిట్టితల్లి ...జడ్జిమెంట్ డెటార్లు

**నోటీసు**

పై దావా గ్రంథములో నెహ్రు కాలనీలోని మీ ఇంటిని జప్తు చేయమని కోరిన పిటిషను దాఖలా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా తీసుకొనక తిప్పి పంపుచున్నారని శ్రీకోర్టు వారి దృష్టికి తీసుకొనిరాగా పేపరు పబ్లికేషను ద్వారా నోటీసులు పంపమని వేసిన శ్రీకోర్టు వారి ఆర్డరు ద్వారా ఈ నోటీసు మీకు పంపడ మైనది. సదరు దావా గ్రంథము **ది.02-09-2024** నకు వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని శ్రీకోర్టు వారి ఎదుట మీ సంజాయిషీ తెలుపని యెడల మీ పరోక్షమున తీర్మానించుదురని తెలియజేయడమైనది.

**షెడ్యూలు**

R.C.C.building comprised in an extent of sq. 103 yards covered by Plot No.101 and D.No.8-42 in R.S.No.205 situated in Nehru colony, Vatluru Panchayat, Pedapadu Mandal Eluru within the following boundaries as per the title deed No.7921/2000 dated 19.09.2000.
**East:** Panchayat Road 24.6 feet
**South:-** Property of Mekam Adinarayana 37 feet
**West:-** Property of Marla Sanyasi 24 feet
**North :-** Property of Sarmpati Veerachari 39.6 feet
With in those boundaries with all easementary rights

ఏలూరు **ఎస్.బ్రహ్మం,** అడ్వకేట్,
ది.29-7-24 ఏలూరు, ప.గో.జిల్లా.
సెల్:9492932214

### NOTICE

**IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION):TADEPALLIGUDEM.**
**I.A.No.452/2024**
**in O.S.No.207/2015**

Between:
1.Kothwala Kantham, & 4 others ...petitioners/plaintiffs.
And
1. Kothwala Appala Raju & others ...respondents/defendants.
To.
**RESPONDENTS NO.21 and 22/ PROPOSED PARTIES:**
21. Vellanki Parvathi, W/o. Suresh, aged 42 years, Hindu, female, Housewife, D.No. 4-2-31/2, Salipeta, Main Road, Tadepalligudem, TPG PJCJC. Ph.no.9505544441
22. Poppoppula Annapurna, W/o. Srinivas, aged 40 years, Hindu, female, Housewife, D.No. 4-2-31/2, Salipeta, Main Road, Tadepalligudem, TPG PJCJC. Ph.no.9032775889.

Please take notice that the above petition is filed by the petitioner/ plaintiff against the respondents. The matter is posted for the appearance of the above respondents 21 and 22/proposed parties on dt. 12-08-2024 from 10.30 A.M. onwards, on which day you may appear in person or through your advocate and file your objections/pleadings if any. Otherwise the matter will be adjudicated according to law in your absence.

**G.Syama Prasad Mukherjee,**
**N. Surya Mani,**
Tadepalligudem. Advocates,
Date: 07-08-2024 Tadepalligudem

**మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**O.S.No.461/2022**

బిట్వీన్ :
పొన్నగంటి వెంకటరత్నం ...వాది
Vs
బి.వి.శేషుకుమార్ వగైరా ...ప్రతివాదులు

పై నంబరు దావాను వాది 1వ ప్రతివాది తండ్రి అయిన బట్టా సూర్యప్రకాశరావు గారు వ్రాయించి యిచ్చిన రిజిష్టర్ తనఖా బాకీ కొరకు వారసులపైన దావా వేసినారు. సదరు దావాలో 3వ ప్రతివాది పడగా విజయలక్ష్మి, W/o.సత్యనారాయణ చెన్నై బట్టా హరికృష్ణ ముఖేష్, S/o.విజయ భాస్కరరావు పెంటపాడు, మరియు బట్టా శ్వేత కిరణ్మయి, D/o.విజయ భాస్కరరావు పెంటపాడు, పెంటపాడు మండలం వాస్తవ్యులు సమన్లు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం Substituted Service ద్వారా సమన్లు అమలు చేయగలందులకు ఈ Publication ఇవ్వడమైనది. కావున పై ప్రతివాదులు **ది.20-8-2024న ఉ.10 గంటలకు** పై కోర్టునకు ప్రత్యక్షముగా కాని పరోక్షముగా కాని హాజరు అయ్యి శ్రీకోర్టు వారికి ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనియెడల వారు పరోక్షమున తీర్పు గావింతురు అని తెలియజేయడమైనది.

**చిత్తగించవలెను**
**G.K.DURGA DEVI** B.Sc., B.L.
వాది తరపు అడ్వకేట్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం-534101.
తేది.23.7.24 సెల్ : 9985592776